RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | శనివారం 5 అక్టోబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 145 | పేజీలు: 4 | వెల: రూ.5/-



## మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలపై ప్రధాని భద్రతా సమావేశం

2లో..

# మూసీ నది ప్రక్షాళన

## సీఎం రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్‌పై ఓ శాస్త్రీయ పరిశోధన



హైడ్రాతో హైరానా పడుతున్న తెలంగాణ ప్రజలకు ఓ శాస్త్రీయ పరిష్కారం అంటూ ప్రభాత సూర్యుడు చీఫ్ ఎడిటర్ కస్తా శంకర్రావు తో ముఖాముఖిలో ఆర్కిటిక్ రంగంలో ఇంజనీర్ గా సేవలందించిన యారాల నరసింహారెడ్డి

దేశంలోనే ఆర్కిటెక్ రంగంలో ప్రత్యేక గుర్తింపు ఉండి, వరుసగా ఎంపీగా ఉంటూ భారత పార్లమెంటులో దేశ ఆర్కిటిక్ రంగంలో చారిత్రాత్మకమైన ప్రసంగాలు చేసిన దివంగత బి.యన్.రెడ్డి ప్రియ శిష్యుడు ఆర్కిటెక్ రంగంలో నిశ్చాతుడు అయిన యారాల నరసింహారెడ్డి ప్రభాత సూర్యుడు చీఫ్ ఎడిటర్ కస్తా శంకర్రావుతో "మూసి ప్రక్షాళన పేరుతో హైడ్రా దూకుడు"పై ముఖాముఖి



**హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):**

భావితరాల భవిష్యత్తుకు, త్రాగునీటి అవసరాలకు మూసి ప్రక్షాళన జరగాల్సిందే!
హైదరాబాద్ మహానగరం సుందరీకరణ కావలసిందే!
ప్రపంచ పటంలో హైదరాబాదుకు గుర్తింపు ఉండాల్సిందే!
మూసి పరివాహక ప్రాంత అక్రమ కట్టడాలు తొలగించాల్సిందే!
వెంటనే కూల్చివేతలలో ఇండ్లు కోల్పోతున్న మధ్యతరగతి దిగువ మధ్యతరగతి కుటుంబాలకు పక్కా ఇల్లు నిర్మించాల్సిందే!
పేదలకు ఒక న్యాయము, గొప్పోళ్లకు ఇంకొక న్యాయం జరగడానికి వీలు లేదు!
హైడ్రా దూకుడును ఆపి, ఆల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు చేసి, ఏకాభిప్రాయంకై రేవంత్ సర్కార్ కృషి చేయాలి.

..మిగతా 2లో



# భారీ ఎన్‌కౌంటర్

## 36 మంది మావోయిస్టులు మృతి

**ఛత్తీస్‌గఢ్, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఎన్‌కౌంటర్‌లో ఇప్పటివరకు 36 మంది నక్సల్స్ మృతి చెందారు. దండకారణ్యంలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య భీకర కాల్పులు జరుగుతున్నాయి. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో భారీగా ఆయుధాలు, మందు గుండు సామగ్రి లభించడంతో.. ఆ ప్రాంతంలో మావోయిస్ట్ అగ్రనేతలు ఉన్నారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మావోయిస్టులను లేకుండా చేస్తామని కేంద్ర ప్రభుత్వం గట్టి హెచ్చరికలు చేసిన నేపథ్యంలో.. దండకారణ్యం నిత్యం కాల్పుల మోతతో దద్దరిల్లిపోతోంది. పోలీసులు, నక్సల్స్ మధ్య తరచూ భీకరంగా కాల్పులు జరుగుతూనే ఉన్నాయి. అయితే గత కొంత కాలంగా జరుగుతున్న ఆపరేషన్లలో భారీగా మావోయిస్టులు నేలకొరుగుతుండటంతో వారికి గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మరీ ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న నక్సల్స్ ఏరివేత ఆపరేషన్లలో మావోయిస్ట్ అగ్రనేతలను పోలీసులు, భద్రతా సిబ్బంది మట్టుబెడుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా మరోసారి ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన కాల్పుల్లో

..మిగతా 2లో

# 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని పాలసీ సిద్ధం చేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** ప్రభుత్వ స్పోర్ట్స్ పాలసీపై ముఖ్యమంత్రి సీరేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. యంగ్ ఇండియా అకాడమీ ఏర్పాటుతో పాటు హైదరాబాద్ లో ఉన్న అన్ని ప్రధాన స్టేడియాలను ఒకే హబ్ గా తీర్చిదిద్దాలి అని సూచించారు. ఇక, స్కిల్ యూనివర్సిటీ బోర్డు తరహాలో స్పోర్ట్స్ బోర్డు ఏర్పాటు చేయాలని చెప్పారు. క్రీడల్లో పతకాలు సాధించే క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాల పైన అధ్యయనం

..మిగతా 2లో


# ధరణి పోర్టల్ రద్దు.. త్వరలో కొత్త చట్టం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** ధరణి పోర్టల్ ను రద్దు చేసి త్వరలో ఆర్ఓఆర్ చట్టం తీసుకు వస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ నెలాఖరులోగా అమల్లోకి తెస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండే విధంగా రూపొందించాం.. ప్రజల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుంటాం.. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్స్ ను గాలికి వదిలేసింది.. పూర్తైన ఇండ్లను దసరా లోపు పేద ప్రజలకు అందజేస్తామని ఆయన వెల్లడించారు. ఇక, వెంటనే మరమ్మత్తులు మౌలిక వసతులు కల్పిస్తాం.. ప్రతి నియోజకవర్గానికి 3500 నుంచి 4 వేల ఇండ్లు మంజూరు.. ప్రతిపక్షాల సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

..మిగతా 2లో



## నాగార్జున పిటిషన్‌పై విచారణ వాయిదా

**హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై సినీ నటుడు అక్కినేని నాగార్జున న్యాయస్థానాన్ని ఆశ్రయించారు గురువారం నాంపల్లి మనో రంజన్ కోర్టులో పరువు నష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. నాగార్జున పిటిషన్ పై శుక్రవారం న్యాయస్థానం విచారణ చేపట్టాల్సి ఉండగా వాయిదా పడింది. న్యాయ మూర్తి సెలవులో ఉండడంతో విచారణ సోమవారానికి వాయిదా వేశారు. పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్ట నున్నారు. కాగా అక్కినేని నాగ చైతన్య, సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా దుమారం రేపుతున్నాయి. నాగచైతన్య, సమంత విడాకులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆరే కారణమంటూ ఆమె మీడియా ముందు సంచలన ఆరోప ణలు చేశారు. అయితే.. నాగా ర్జున, నాగచైతన్య కలిసి సమంతపై ఒత్తిడి తీసుకొచ్చారని.. అది నచ్చకే ఆమె తన భర్తతో విడాకులు తీసుకుందంటూ కొండా సురేఖ ఆరోపణలు చేయటం సర్వత్రా సంచలనంగా మారింది. ఈ విషయంపై అటు ఇండస్ట్రీ ప్రముఖులంతా విరుచుకుపడు తుండగా.. అటు బీఆర్ఎస్ నేతలు కూడా తీవ్రంగా ఖండిస్తున్నారు.

# సకాలంలో ధ్రువపత్రాలను పరిశీలించాలి

### నేటితో డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేయండి
### జిల్లా కలెక్టర్లకు సీఎం రేవంత్ ఆదేశం
### 9,090 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి



**హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** తెలంగాణ డీఎస్సీ జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (జీఆర్ఎల్) సెప్టెంబర్ 30న విడుదలైన సంగతి తెలిసిందే. ఫలితాలు విడుదలైన మరుసటి రోజు నుంచే అంటే అక్టోబర్ 1వ తేదీ నుంచే సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభమైంది. 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసిన అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు హాజరవ్వాలంటూ అభ్యర్థుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు, ఈమెయిల్‌లకు విద్యాశాఖ అధికారులు ఇప్పటికే సమాచారాలు పంపించారు. ఇక ఈ ప్రక్రియను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్టోబరు 5వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో అక్టోబరు 3న ఆయన ఈ మేరకు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. మొత్తం 11,062 మంది ఎంపికైన అభ్యర్థులకు అక్టోబరు 9న ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు వీలుగా జిల్లాల్లో వేగంగా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేయాలని అన్నారు. అందుకు తగిన విధంగా సకాలంలో ధ్రువపత్రాలను పరిశీలించాలని సూచించారు. ఇప్పటికే 9,090 మందికి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని విద్యాశాఖ అధికారులు

..మిగతా 2లో



## రేవంత్ రెడ్డి మొనగాడు కాదు.. మోసగాడు

### రేవంత్ రెడ్డికి రైతులు, ప్రజలు అంటే పట్టింపు లేదు
### రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ విఫలం
### తొర్రూరు రైతు ధర్నాలో హరీశ్ రావు

**మహబూబాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** పది నెలల ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డికి రైతులు, ప్రజలు అంటే పట్టింపు లేదు.. ఆయన మొనగాడు కాదు మోసగాడు అని తేలిపోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు రైతు ధర్నాలో హరీశ్ రావు పాల్గొని ప్రసంగించారు. రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైంది. కొమరెల్లి మల్లన్న, యాదాద్రి, భద్రాద్రి, సమ్మక్క -%సారలమ్మ మీద ఒట్టు పెట్టి మొనగాడు లెక్క మాట్లాడిండు. కానీ ఇప్పుడు ఆయన మోసగాడు అని తేలిపోయింది. రైతు బంధు, రుణమాఫీ, పించన్లు, మహాలక్ష్మి అన్ని చేస్తా అన్నాడు. ఇప్పుడు సప్పుడు లేదు. మొత్తం రుణమాఫీ అయ్యింది రాజీనామా చేయ్ హరీష్ రావు అని సవాల్ విసిరిండు. మరి రుణమాఫీ అయితే ఇంత మంది రైతులు ధర్నాకు ఎందుకు వచ్చారు..? పాలకుర్తి

..మిగతా 2లో

# ఎల్‌ఏసీ వెంబడి చైనా వేగంగా నిర్మిస్తోంది



### ఎయిర్ చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** వాస్తవాధీన రేఖ వెంబడి, ముఖ్యంగా లద్దాఖ్ సెక్టార్‌లో చైనా వేగంగా మౌలిక వసతులు, నిర్మాణాలు చేపడుతోందని వాయుసేన చీఫ్, ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శుక్రవారంనాడు తెలిపారు. ఇండియా సైతం అదే స్థాయిలో సరిహద్దుల వెంబడి సౌకర్యాలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు చెప్పారు. 'ఎయిర్ ఫోర్స్ డే' రానున్న నేపథ్యంలో శుక్రవరంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలోని వివిధ చోట్ల నెలకొంటున్న ఉద్రిక్తతలు, యుద్ధాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# భారీ ఎన్‌కౌంటర్

మొదటి పేజీ తరువాయి...

ఏకంగా 36 మంది మావోయిస్ట్‌లు హతం అయ్యారు. ఇక ఆ ప్రాంతంలో మావోయిస్ట్ అగ్రనేతలు ఉన్నారనే పక్కా సమాచారం భద్రతా బలగాలకు అందింది. దీంతో వారు కాల్పులను మరింత ముమ్మరం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రేంజ్‌లో ఉన్న నారాయణ్‌పూర్- దంతెవాడ జిల్లాల సరిహద్దుల్లో శుక్రవారం మధ్యాహ్నం ఎన్‌కౌంటర్ ప్రారంభం అయింది. అబూజ్‌మడ్ దండకారణ్యంలో మావోయిస్టులు ఉన్నారని.. వారిలో కొందరు అగ్రనేతలు కూడా ఉన్నారనే సమాచారం భద్రతా బలగాలకు అందడంతో ఆ ప్రాంతంలో స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలోనే మావోయిస్టులు ఎదురుపడి కాల్పులకు దిగారు. దీంతో ఎదురు కాల్పులు ప్రారం భించిన భద్రతా బలగాలు ఇప్పటివరకు 36 మందిని మట్టుబెట్టాయి. ఇప్పటివరకు సంఘటనా స్థలంలో 36 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించామని.. పోలీసులు వెల్లడించారు. ఇక ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భారీ ఎత్తున పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అందులో ఏకే-47 లాంటి అత్యాధునిక ఆయుధాలు లభించడంతో మావోయిస్టు అగ్రనేతలు సమావేశం ఏర్పాటు చేశారని.. వారు అక్కడే ఉన్నారని అనుమానిస్తున్న పోలీసులు ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేశారు. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ కొనసాగుతుండగా.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# మూసీ నది ప్రక్షాళన

## సీఎం రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్‌పై ఓ శాస్త్రీయ పరిశోధన

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ రాష్ట్రంలో హైడ్రా అనే కొత్త పదం తెరపైకి రావడంతో రాష్ట్రంలోనే కాక ఇతర ప్రాంతాలలో కూడా హైడ్రా గురించి చర్చించుకోవడం చూస్తూ ఉన్నాం. మూసి ప్రక్షాళన పేరుతో అక్రమ కట్టడాలు అంటూ మూసి పరివాహక ప్రాంతాన్ని సుందరంగా చేసి ప్రపంచంలోనే హైదరాబాదుకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు తేవాలని తలంపుతో, ఊపులో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసి ప్రక్షాళన పేరుతో, హైడ్రా అనే ప్రత్యేకమైన అధికారాలతో ఐపీఎస్ రంగనాథును హైడ్రా అధికారిగా నియమించిన విషయం తెలిసిందే. ప్రభుత్వపరంగా చట్టబద్ధత కల్పించి, విస్తృత అధికారాలను ఇస్తూ మూసి పరివాహక ప్రాంతంలోని అక్రమ కట్టడాలను తొలగించాలని హైడ్రాకు నిర్దేశించడం జరిగింది. దీనితో హైడ్రా దూకుడు పెంచి నిర్మాణాలను నేలమట్టం చేస్తున్న వైనం చూస్తున్నాం. దీంతో యావత్తు తెలంగాణ సమాజం చర్చించుకుంటున్న విషయం చూస్తున్నాం. ఇదే విషయమై ప్రభాత సూర్యుడు చీఫ్ ఎడిటర్ కస్తాశంకరరావుతో ఆర్కిటిక్ రంగంలో నిష్ణాతుడు ఇంజనీరుగా సేవలందించిన యారాల నరసింహారెడ్డి ప్రభాత సూర్యుడు ముఖాముఖి లో మాట్లాడుతూ 400 సంవత్సరాల నుండి ప్రపంచంలోనే హైదరాబాద్ కు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందని అన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలించిన నిజాం నవాబులకు యావత్తు తెలంగాణ ప్రజలు సలాం చెప్పాల్సిందే అని అన్నారు. చారిత్రాత్మకంగా హైదరాబాదు విభిన్న మతాలు, జాతులు, కులాలు, ప్రాంతాలతో ఏర్పడి భారత సంస్కృతి, సాంప్రదాయాలను భిన్నత్వంలో ఏకత్వం లాగా పరిపాలించి భారత్ లోనే మొట్టమొదటి రైల్వే లైన్ ఏర్పాటు చేసి ప్రపంచంలోనే రైల్వేలకు గుర్తింపు తెచ్చిన నవాబులు మన నిజాంలు అని అన్నారు. హైదరాబాదులో ఎన్నో చారిత్రాత్మకమైన కట్టడాలను నిర్మించి భావితరాలకు విద్యాపరంగా, ఉస్మానియా యూనివర్సిటీ వైద్య పరంగా, ఉస్మానియా మెడికల్ కాలేజ్, ఉస్మానియా దవాఖాన నిజాం కాలేజీ, లాంటి ఎన్నో ప్రఖ్యాత కట్టడాలను నిర్మించి, ప్రజా సంక్షేమ పాలన చేసి, ప్రపంచ దేశాలను హైదరాబాదు వైపు చూసినట్లు చేసిన గొప్ప పాలకులని కొనియాడారు. మూసి పరివాహక ప్రాంతం గూర్చి ఆర్కిటెక్ ఇంజనీరు యారాల నరసింహారెడ్డి మాట్లాడుతూ మూడు జిల్లాలకు అనుసంధానంగా ఉన్న నది మూసి అని అన్నారు. భువనగిరి, నల్లగొండ, హైదరాబాదు, సూర్యాపేట తదితర జిల్లా వాసులకు రైతులకు సాగునీరుకు, త్రాగునీరుకు ఎంతో ఉపయోగపడే నది మూసి నది అన్నారు. కాలక్రమేనా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయ మార్పులు రావడంతో ఆంధ్ర ప్రాంతవాసులు మెజారిటీ కాలం పాలిస్తూ మూసీ నదిని నిర్లక్ష్యం చేయడమే కాకుండా పరివాహక ప్రాంతం చుట్టూ రియ ల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ తమకు ఉన్న డబ్బు, రాజకీయ పలుకుబడితో అక్రమ లేఔట్లు చేసి మూసి పరివాహక ప్రాంతాన్ని విధ్వంసం చేశారని అన్నారు. ఎన్నో పోరాటాలు, ఎన్నో ఆత్మబలిదానాలు, సకల జనుల సమ్మెల పేరుతో ఢిల్లీ పెద్దల మెడలు వంచి తెలంగాణ సమాజం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. అయినప్పటికీ గత పది సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రంలో గుత్తాధిపత్యంగా పాలించిన బి ఆర్ ఎస్ పార్టీ, కెసిఆర్ ప్రభుత్వం మూసీ నది పరివాహక ప్రాంత ప్రక్షాళన గూర్చి నది పరివాహక సుందరం గురించి అటువైపుగా కొత్తగా అడుగులు వేయకపోవడం శోచనీయమని అన్నారు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి సర్కార్ మూసీ నది ప్రక్షాళన పేరుతో ప్రత్యేక దృష్టి పెట్టి హైడ్రా అనే చట్టబద్ధ సంస్థను ఏర్పాటు చేసి, అక్రమ కట్టడాలను తొలగించడం హర్షించదగ్గ పరినామమని అని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ మూసి ప్రక్షాళన పేరుతో చెరువులను, కుంటలను, నాళాలను, కబ్జా చేసి రాజకీయ పలుకుబడితో మూసి పరివాహక ప్రాంతంలో అక్రమ కట్టడాలను నిర్మించిన అట్టి కట్టడాలను నిర్దాక్షిణ్యంగా తొలగించాల్సిందే అన్నారు. అక్రమాలను తొలగించడం అంటే మళ్లీ మన చెరువులను, కుంటలను, నాలాలను కాపాడుకోవడమే అని అన్నారు. 30 నుండి 40 సంవత్సరాల నుంచి మూసి ప్రాంతంలో అన్ని ప్రభుత్వ అనుమతులతో పక్కా ఇల్లు నిర్మించుకున్న మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వము వెంటనే భరోసా కల్పిస్తూ వారికి అనువైన ప్రాంతంలో పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. ఎన్నో ఆశలతో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అక్కున చేర్చుకొని గంపగుత్తగా ఓట్లు వేసి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్న ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని అన్నారు. అవసరమైతే రెండు, మూడు రోజులు హైడ్రా నిర్వహిస్తున్న కూల్చివేతలను ఆపివేసి, అన్ని రాజకీయ పక్షాల నాయకులను, ప్రజాసంఘాలను, రాజకీయ పార్టీలను తెలంగాణ మేధావులతో ప్రభుత్వపరంగా అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఇండ్లు కోల్పోయి, నిర్వాసితులవుతున్న పేదలను ఆదుకునే దిశగా సమావేశంలో తీర్మానాలు చేసి, అట్టి ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. మూసి ప్రక్షాళన అంటే హైదరాబాద్ మహానగరానికి సాగునీరు, త్రాగునీరు అందించిన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, హుస్సేన్ సాగర్, గండిపేట చెరువులు, రిజర్వాయర్లకు పునర్జీవనం పోయడమే అన్నారు. మూసీ నదిని పర్యాటక ప్రాంతంగా చేస్తానని రేవంత్ రెడ్డి అనడం ఆహ్వానించ పరిణామమే అయినప్పటికీ భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట, ఆలేరు జనగామ జిల్లాల రైతుల ప్రజల తాగునీరు, సాగునీరు పారించే మూసి వెడల్పును కుదించడం చేయవద్దని అన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో కేంద్ర ప్రభుత్వంతో సహాయ సహకారాలు తీసుకొని మూసి ప్రక్షాళన చేస్తే స్వచ్ఛమైన నీరును ఏర్పాటు చేసుకోవడమే కాకుండా, వర్షపు నీటిని కూడా సద్వినియోగం చేసుకొని మూసీ నదిని జీవనది లాగా నీరును పారించే పాయలాగా చేసుకుని ఆయా ప్రాంత రైతులకు ప్రజలకు మేలు చేసుకోవచ్చు అని అన్నారు. ముఖ్యంగా ఇది దేశానికే తలమానికగా ఉన్న హైదరాబాదు అభివృద్ధిని మూసి ప్రక్షాళనను కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక చొరవ చూపి రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించి, కావలసిన నిధులను కూడా సమకూరుస్తే మూసీ ప్రక్షాళన పెద్ద సమస్య కాదని ప్రఖ్యాత ఆర్కిటెక్ ఇంజనీర్ యారాల నరసింహారెడ్డి ప్రభాత సూర్యుడితో ఘంటాపదంగా అన్నారు.


ప్రభాత సూర్యుడు ముఖాముఖిలో చీఫ్ ఎడిటర్ కస్తా శంకర్రావు తో హైడ్రాకు శాస్త్రీయ పరిష్కారం అంటూ మాట్లాడుతున్న ఆర్కిటిక్ రంగంలో సేవలందించిన ఇంజనీరు యారాల నరసింహారెడ్డి

# 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని పాలసీ సిద్ధం చేయాలి

మొదటి పేజీ తరువాయి...

చేసి నివేదిక ఇవ్వాలి అని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని పాలసీ సిద్ధం చేయాలి అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ తర్వాత, పేద ప్రజల హృదయాలలో దీపమై వెలిగిన మహనీయుడు కాకా (జి. వెంకటస్వామి) అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జి.వెంకటస్వామి జయంతి (05-10-2024) సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా కేంద్రమంత్రిగా, సేవలందించారని.. సింగరేణి కార్మికుల జీవితాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని.. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేసారని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. అలాగే, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో కాకా అలు పెరుగని పోరాటం చేసారని.. 1969లో తెలంగాణ కోసం జైలు కెళ్లాడని అన్నారు. ఆయన జీవితం కార్మికులు, పేదలతోనే మమేకమైందని.. నిలువ నీడ లేని నిరుపేదలకు గూడు కల్పించాలని గుడిసెల పోరాటం చేసి.. కొన్ని వేల గుడిసెలు పేద లకోసం వేయించారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.

# ధరణి పోర్టల్ రద్దు.. త్వరలో కొత్త చట్టం

మొదటి పేజీ తరువాయి...

తెలిపారు. ఈనెల 7వ తేదీత ప్రజా ప్రభుత్వం ఏర్పాడి 10 నెలలు పూర్తి అవుతుంది అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 10 నెలల్లో ప్రజలు కోరుకున్న వాటిని సాధించలేక పోయాం.. రాబోయే రోజుల్లో తెల్ల రేషన్ కార్డు సహా అన్ని పథకాలకు స్మార్ట్ కార్డుతో అనుసంధానం చేస్తాం.. ఈ దసరా లోపు స్మార్ట్ కార్డులు ఇస్తాం.. అర్హతలను బట్టి స్మార్ట్ కార్డు ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం.. రాబోయే నాలుగేళ్లలో ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన ప్రతి పేదలకు ఇళ్లు ఇస్తామన్నారు. జనవరి నుంచి ఆసరా పెన్షన్లు, సన్న బియ్యం పంపిణీ చేస్తాం.. రుణ మాఫీ కానీ రైతులకు 13 వేల కోట్ల రూపాయలతో త్వరలో విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాలు సొల్లు మాటలు మాట్లాడుతున్నారు.. 10 ఏళ్లలో బీఆర్ఎస్ రైతులకు ఇచ్చింది 15 వేల కోట్లు మాత్రమే.. ప్రతిపక్ష పార్టీలు పోరం బోకు మాటలు మాట్లాడుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు.

# మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలపై ప్రధాని భద్రతా సమావేశం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తత దృష్ట్యా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉన్నత స్థాయి భద్రతా సమావేశాన్ని పిలిచి ప్రస్తుత పరిణామాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఇజ్రాయెల్‌పై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి దాడి తరువాత పెరిగిన శత్రుత్వాలపై హెూం మంత్రి, రక్షణ మంత్రి, విదేశాంగ మంత్రి, ఆర్థిక మంత్రి, జాతీయ భద్రతా సలహాదారుతో కూడిన కమిటీతో పాటు ప్రధాని చర్చించారు. దౌత్యం, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని భారతదేశం అన్ని పార్టీలను కోరింది. మధ్యప్రాచ్యంలో యుద్ధం చమురు, పెట్రోలియంలతో పాటు దాని ఉత్పత్తుల వాణిజ్య షిప్పింగ్, సరఫరా గొలుసులపై ప్రభావం చూపుతుందని కూడా సమావేశంలో చర్చించారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఎర్ర సముద్రంతోపాటు ఏడెన్ గల్ఫ్ లోని కీలక మార్గాల్లో విస్తృత వాణిజ్య అంతరాయాలకు భారతదేశం సిద్ధంగా ఉందని అభిప్రయపడ్డారు. ఈ వివాదం సరుకు రవాణా ఛార్జీలలో గణనీయమైన పెరుగుదలకు దారితీయవచ్చు. లెబనాన్ లోని ఇరాన్ మద్దతుగల హిజ్బుల్లా యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులతో సన్నిహిత సంబంధాలను కలిగి ఉంది. వారు ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ మార్గాల ద్వారా వస్తువులను రవాణా చేసే వ్యాపార నౌకలపై చాలా దాడులకు బాధ్యత వహిస్తారు. గత ఏడాది అక్టోబర్‌లో ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఇరాన్ మద్దతుగల హౌతీ మిలీషియా ఈ ప్రాంతంలో ప్రపంచ వాణిజ్యానికి అంతరాయం కలిగించింది. ఇది భారతదేశంలో పెట్రోలియం ఎగుమతులపై మాత్రమే ప్రభావం చూపింది. గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై పాలస్తీనా సాయుధ సమూహం హమాస్ దాడి చేసినప్పటి నుండి ఇజ్రాయెల్ నిరంతరం గాజాపై బాంబు దాడి చేస్తోంది. ఇందులో 40 వేల మందికి పైగా మరణించారు. లెబనాన్ లోని ఇరాన్ మద్దతుగల సాయుధ సమూహం హిజ్బుల్లా, పాలస్తీనాకు మద్దతుగా వచ్చినందుకు ఇజ్రాయెల్‌పై దాడి చేయడం ప్రారంభించింది. దీని కారణంగా, ఇజ్రాయెల్ లెబనాన్‌పై లక్షిత భూదాడులను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే హిజ్బుల్లా యొక్క 7 కమాండర్లను చంపింది.

# రేవంత్ రెడ్డి మొనగాడు కాదు.. మోసగాడు

మొదటి పేజీ తరువాయి...

మండలంలోనే 4314 మందికి రుణమాఫీ కాలేదు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. రాష్ట్రంలో 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ అయిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పారు. మిగతా వారికి కాలేదు అన్నడు. చెప్పిన 22 లక్షల మందిలో కూడా కొందరికి పూర్తిగా రుణమాఫీ కాలేదు. రకరకాల కారణాలతో రుణమాఫీ ఆపే ప్రయత్నం చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. 31 సాకులు పెట్టి రుణమాఫీ ఎగబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. రేవంత్ మోసగాడు అని రైతులు, ప్రజలు అంటున్నారు అని హరీశ్‌రావు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాల పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఆగష్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేస్తామని అన్ని దేవుళ్లపై ఒట్టుపెట్టి మోసగాడిగా మారారని హరీష్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి మొనగాడు కాదు మోసగాడు అని విమర్శించారు. 31 కుంటి సాకులు చెప్పి రేవంత్ రుణమాఫీ ఎగ్గొడుతున్నారని అన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోమని హరీష్‌రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి దసరాలోపు రైతుబంధు డబ్బులు ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. హామీలు అమలు చేసే వరకూ రేవంత్‌ను వదిలిపెట్టమని హెచ్చరించారు. ఒక్క బస్సు తప్ప రేవంత్ పాలన అంతా తుస్సేనని హరీష్‌రావు విమర్శించారు. రైతులు చనిపోయినా రేవంత్‌కు కనికరం లేదా అని ప్రశ్నించారు. ప్రజల నుంచి నిరసన వచ్చినప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులను రైతులు నిలదీయాలని అన్నారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి గుండాగిరిచేస్తే బీఆర్ఎస్ నేతలు చూస్తూ ఊరుకోరని హరీష్‌రావు వార్నింగ్ ఇచ్చారు. పాలకుర్తికి ఇద్దరు ఎమ్మెల్యేలట... అయినా అభివృద్ధి జరగడం లేదని హరీష్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఓ బ్లాక్ మెయిలర్, అబద్ధాలకోరు అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శలు చేశారు. ఇవాళ (శుక్రవారం) తొర్రూరులో ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మహాధర్నా చేపట్టింది. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మధుసూదనాచారి, మాలోతు కవిత, రుణమాఫీ కానీ రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయాకరరావు మాట్లాడుతూ... సీఎం అయ్యాక రేవంత్‌రెడ్డి అబద్ధాలు ఎక్కువ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను ఎందుకు ఓడించామని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. రుణమాఫీ చేసేదాక వదిలిపెట్టామని ఎర్రబెల్లి దయాకర్ రావు హెచ్చరించారు.



# సకాలంలో ధ్రువపత్రాలను పరిశీలించాలి

మొదటి పేజీ తరువాయి...



ముఖ్యమంత్రికి తెలియజేశారు. ముఖ్యమంత్రితో నిర్వహించిన ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంతోపాటు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ధ్రువపత్రాల పరిశీలన నేటితో ముగియనుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నీ జిల్లాల్లోని ఆయా కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియకు అభ్యర్థులు హాజరుకావల్సి ఉంటుంది. మార్కులు, రోస్టర్ పాయింట్ల ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు ఈ ప్రక్రియ రేపటితో ముగుస్తుంది. ఇప్పటికే ఈ జాబితాలు అధికారిక వెబ్‌సైట్‌తోపాటు, డీఈఓ వెబ్‌సైట్లలోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. అభ్యర్థులు డీఈఓలు గుర్తించిన కేంద్రాల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల ఫొటో కాపీలతో హాజరుకావల్సి ఉంటుంది. అంతా సక్రమంగా జరిగితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినట్లు ఈ నెల 9వ తేదీన నియామక పత్రాలు అందజేసే అవకాశం ఉంది.

# ఎల్‌ఏసీ వెంబడి చైనా వేగంగా నిర్మిస్తోంది

మొదటి పేజీ తరువాయి...

సవాళ్లను ఎదుర్కొనేందుకు దేశీయ ఆయుధ తయారీ వ్యవస్థలు ఉండటం చాలా ముఖ్యమని అన్నారు. 2047 నాటికి భారత దళాల వద్ద పూర్తిగా స్వదేశీ ఆయుధాలే ఉండాలన్నారు. మూడు యూనిట్ల ఎస్-400 మిజైల్ సిస్టమ్స్‌ను రష్యా నుంచి దిగుమతి అయ్యాయని, తక్కిన రెండు యూనిట్లను వచ్చే ఏడాది అందజేస్తామని ఆ దేశం వాగ్దానం చేసిందని ఒక ప్రశ్నకు సమాధానంగా ఏపీ సింగ్ తెలిపారు. ఇండియా వద్ద 83 లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (%ాజూాం%) ఉన్నారు. త్వరలోనే 97 మార్క్ 1, మార్క్ 2 ఎయిర్‌క్రాఫ్ట్ సేకరించనున్నామని చెప్పారు. ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే వెళ్లే మీడియం-రేంజ్ సర్ఫేస్-టు-ఎయిర్ మిజైల్స్ (ఎంఆర్ఎస్ఏఎం), ఆకాష్ మిసైల్ సిస్టమ్ ను ప్రవేశపెట్టే ప్రక్రియ జరుగుతోందన్నారు. భారత్ అనవసరంగా దాడులకు వెళ్లదని, మనల్ని వెనక్కి నెట్టే ప్రయత్నం చేసినప్పుడే దానికి దీటుగా స్పందించాల్సి వస్తుందని పరోక్షంగా చైనాను ఉద్దేశించి అన్నారు. అందుకు సంబంధించిన తమ ప్లాన్స్ తమకు ఉంటాయని చెప్పారు. వారికంటే మనం మంచి శిక్షణ ఇవ్వగలుగుతున్నామని కచ్చితంగా చెప్పగలనని అన్నారు. టెక్నాలజీ పరంగా ప్రస్తుతానికి కొంత వెనకబడినప్పటికీ దానిని అధిగమిస్తామన్నారు. ప్రొడక్షన్ రేట్లకు సంబంధించి కొంత వెనకబడినా పురోగమిస్తామన్నారు. వీటికి సమయం పడుతుందని, రాత్రికి రాత్రే అన్నీ పూర్తికావని చెప్పారు.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# ప్రజలే మంచి, చెడు నిర్ణయిస్తారు

## బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం.. కేసీఆర్‌ది నిర్మాణాత్మక ఆలోచన

### కాంగ్రెస్ పార్టీది కూలగొట్టే అరాచక పాలన.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**సూర్యాపేట, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం..కేసీఆర్‌ది నిర్మాణాత్మక ఆలోచన, కాంగ్రెస్ పార్టీది కూలగొట్టే అరాచక పాలన అని సూర్యాపేట మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ సభ్యత్వ బీమా, సీఎం ఆర్ఎఫ్ చెక్కులు), ఎల్‌వోసీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇల్లు ఇస్తారని నమ్మి ఓట్లేస్తే ఉన్న ఇల్లు కూలగొట్టే పరిస్థితి దాపురించిందన్నారు. రైతు భరోసా లేదు, ఉన్న రైతుబంధు ఇస్తలేరు. అభివృద్ధి చేతకాకనే అరాచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. హామీలను గలికొదిలేసి అభివృద్ధిని ఆటకెక్కించారు. ప్రజల సమస్యలు పట్టకపోగా.. వాళ్లే ఇబ్బందులకు గురిచేస్తున్నరు.. అభివృద్ధి చేసిందెవరో, ఆగం చేస్తున్నదెవరో ప్రజలంతా గమనిస్తున్నరు. హంస పాలను, నీళ్లను వేరు చేసినట్లు ప్రజలే మంచి, చెడు నిర్ణయిస్తారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. పార్టీ సభ్యత్వ బీమాతో కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు.

# సింగరేణి ప్రభావిత ప్రాంతాలను ఆదుకోవాలి

## సత్తుపల్లి ఎమ్మెల్యే



**సత్తుపల్లి- ప్రభాత సూర్యుడు:** మండలపరిధిలో కిష్టారం గ్రామంలో సింగరేణి ప్రభావిత ప్రాంతాల గ్రామాల ప్రజలతో సమావేశంలో పాల్గొని వారి సమస్యలను ఆడిగితేలుసుకున్న సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్,ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్,సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దోమ ఆనంద్ బాబు ,కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి. అనంతరం కిష్టారం గ్రామంలో ఏర్పాటు చేసిన సైనో బంకర్ ను పరిశీలించి,కిష్టారం గ్రామంలోని బాంబ్ బ్లాస్టింగ్ వలన దెబ్బతిన్న ఇల్లును పరిశీలించారు. ఎమ్మెల్యే సింగరేణి ప్రభావిత గ్రామాల సమస్యలను ఖమ్మం జిల్లా కలెక్టర్ కు వివరించారు, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,సింగరేణి అధికారులు ,రెవిన్యూ డివిజన్ అధికారి, తహసీల్దార్,ఎంపీడీఓ ,ఫారెస్టు అధికారులు,పలువులు అధికారులు,మండలం కాంగ్రెస్ నాయకులు,గ్రామ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.







## అరచేతిలో వైకుంఠం చూపి

# మోసగించిన కాంగ్రెస్

### మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు:** కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చాక తెలంగాణ ప్రజలను నిట్ట నిలువున వంచించిందని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం రోజు పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశమైన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు లక్షల రుణమాఫీ పై దేవుళ్లపై ఓట్లు వేసి కూడా మాట తప్పారని రైతన్నలు జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. సంపూర్ణ రుణమాఫీ జరగకుంటే కాంగ్రెస్ ను రైతన్నలే సమాధి చేయడం ఖాయమని ఆయన హెచ్చరించారు. రైతులకు కేసీఆర్ ప్రభుత్వం ఠంచనుగా ఏడాదికి రెండుసార్లు రైతుబంధు పంట సాయం అందించేదని గుర్తు చేశారు. ఎకరాకు 15,000/- రైతులకు, 15,000/- కౌలు రైతులకు, 12,000/- రైతు కూలీలకు ఇస్తామని చెప్పి నేడు నెరవేర్చక పోవడం సిగ్గుచేటని అన్నారు. రుణమాఫీ కోసం సగం మంది రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారని వంకలు పెట్టి ఎగవేయాలని చూస్తే రైతులతో కలిసి ప్రభుత్వంపై తిరగబడతామని ఆయన హెచ్చరించారు. కెసిఆర్ మాదిరిగానే రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా, పంటల కొనుగోలు సక్రమంగా చేయాలని, అన్ని పంటలకు క్వింటాలుకు 500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, నాయకులు చీరాల రమేష్, ఆకుల యాదగిరి, పిఎసిఎస్ ఛైర్మన్ బిట్ల వెంకట్ రెడ్డి, కర్నే అరవింద్, దేవేందర్ గౌడ్, జానీ పాషా, పున్నం రాము, మహేష్ యాదవ్, చీర వంశీ, సాయి గౌడ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# షాదిఖానా పనులు పరిశీలించిన కలెక్టర్

**కల్లూరు- ప్రభాత సూర్యుడు:** మేజర్ గ్రామంలోని జుమా మసీదు లోని నిర్మాణంలో ఉన్న షాదిఖానా పనులను ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి పరిశీలించిన సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ,కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి,సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దోమ ఆనంద్ బాబు . ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆర్.డి.వో, తహసీల్దార్, ఎంపీడీఓ చంద్రశేఖర్, మండల అధికారులు, మైనారిటీ పెద్దలు మరియు మండలం కాంగ్రెస్ నాయకులు,గ్రామ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.






# పేరువంచలో దేవి నవరాత్రులు ఉత్సవాలు

**కల్లూరు -ప్రభాత సూర్యుడు:** మండల పరిధిలో పేరువంచ గ్రామ పంచాయితీ మెయిన్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి విగ్రహం ఏర్పాటు. పేరువంచ మెయిన్ రోడ్డు యూత్ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రుల ఉత్సవాలు.మొదటి రోజు పూజా కార్యక్రమం లో పాల్గొన్న పేరువంచ కనక దుర్గామాత భక్తులు . అమ్మా వారి పూజా కార్యక్రమం లో మంత్రోచర్ణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం లో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మా వారికీ పూజా కార్యక్రమాలు కోలా హెూలంగా నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో పేరువంచ మెయిన్ రోడ్డు యూత్ కమిటీ మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పసుపులేటిని పరామర్శించిన మండల

# కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏనుగు సత్యం బాబు



**కల్లూరు-ప్రభాత సూర్యుడు :** మండల పరిధి కిష్టయ్య బంజరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యం కారణంగా ఖమ్మంలో గల ప్రముఖ ప్రయివేట్ హాస్పిటల్ లో ట్రీట్మెంట్ తీసుకున్న పసుపులేటి శ్రీనివాసరావు ను క్రిష్టయ్య బంజర లో తన నివాసం లో మర్యాద పూర్వకంగా కలిసినా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఏనుగు సత్యంబాబు, హనుమాతండా మాజీ గ్రామ సర్పంచ్ ధారావత్ మోహన్ నాయక్, మచ్చా వెంకటేశ్వరరావు,కప్పల బంధం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లెల్ల కృష్ణారెడ్డి కల్లూరు పట్టణ యువ కాంగ్రెస్ పార్టీ నాయకులు తోట సుబ్బారావు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నూరు వెంకటేశ్వరరావు ప్రవీణ్ కుమార్ తదితరులు శ్రీనివాస్ నివాస గృహానికి వెళ్లి అతని పరామర్శించి శ్రీనివాసరావు ఆరోగ్య పరిస్థితులను గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనకు మనో ధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## కొనసాగుతున్న హైడ్రా తరహా కూల్చివేతలు

### నాగార్జునసాగర్‌లోనూ హైడ్రా తరహా కూల్చివేతలు

**నాగార్జున సాగర్, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** హైదరాబాద్‌లోనే కాదు నాగార్జున సాగర్‌లోనూ హైడ్రా తరహా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. పేదోళ్ల ఇండ్లను మున్సిపల్ అధికారులు దౌర్జన్యంతో కూల్చివేస్తున్నారు. సాగర్ పైలాన్‌కు చెందిన ముడావత్ లక్ష్మణ్ అనే వ్యక్తి ఇంటిపైకి 20 మంది సిబ్బందిని తీసుకొచ్చి మున్సిపల్ అధికారులు భయభ్రాంతులకు గురి చేశారు. వాళ్ల ఇంటిని కూల్చివేశారు. ఈ కూల్చివేతలపై బాధితులు మండిపడుతున్నారు. తమ జాగాలో నిర్మాణం చేపడుతున్న పేదల ఇంటిని మున్సిపల్ కమిషనర్ శ్రీను ఉద్దేశపూర్వకంగానే కూల్చివేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అత్యుత్సాహం చూపిస్తూ ఎలాంటి సమాచారం లేకుండా తమ సిబ్బందితో వచ్చి ఇంటిని కూల్చివేయం ఆమానుషమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు రేవంత్ రెడ్డి సర్కార్ పేదల కడుపు కొడుతున్నదని మండిపడుతున్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయడం చాతగాక హైడ్రా పేరుతో పేద ప్రజలపై దౌర్జన్యం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. మరోవైపు మూసీ బాధితులు కూడా రేవంత్ సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి అసలు ముఖ్యమంత్రిగానే మాట్లాడుతున్నాడా అని మండిపడుతున్నారు. లక్ష మంది మూసీ బాధితులం జేసీబీలు తీసుకొని రేవంత్ రెడ్డి ఇంటికి మీదకు వెళ్తామని హెచ్చరిస్తున్నారు. ఎంతమంది మీద కేసులు పెడతారు.. రేవంత్ రెడ్డిని చంపడానికి అయినా, చావడానికి అయినా సిద్ధమని వార్నింగ్ ఇస్తున్నారు.




### కన్వీనర్ కోటా సీట్లకు

## వెబ్‌ఆప్షన్లు ప్రారంభం

### అక్టోబరు 6 వరకు అవకాశం

### కాళోజీ ఆరోగ్య యూనివర్సిటీ ప్రకటన జారీ

**హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్ల కోసం రెండో రౌండ్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఈ రౌండ్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రెండో రౌండ్‌లో వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు కాళోజీ ఆరోగ్య యూనివర్సిటీ ప్రకటన జారీ చేసింది. అక్టోబరు 4 మధ్యాహ్నం నుంచి 6వ తేదీ మధ్యాహ్నం 1 గంటలోపు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని ప్రకటనలో తెలిపింది. ఇక కన్వీనర్ కోటా కింద మొదటి రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు అక్టోబరు 4వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటలోపు కేటాయించిన మెడికల్ కాలేజీలో చేరాల్సి ఉంటుందని యూవర్సిటీ పేర్కొంది. మరోవైపు మేనేజ్‌మెంట్ కోటా కింద మొదటి దశ కౌన్సెలింగ్‌లో ఎంబీబీఎస్ సీట్లను దక్కించుకున్న విద్యార్థుల వివరాలను కూడా కాళోజీ ఆరోగ్య యూనివర్సిటీ గురువారం ప్రకటించింది. కాలేజీల వారీగా అడ్మిషన్లు పొందిన విద్యార్థుల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఆర్మీ కేటగిరీ కన్వీనర్ కోటా సీట్ల ప్రాధాన్య క్రమాన్ని సైనిక్ వెల్ఫేర్ బోర్డు ప్రకటించింది. దరఖాస్తు చేసుకున్న వారిలో 447 మంది అర్హత సాధించారు. 31 మందికి సరైన పత్రాలు లేవని వెల్లడించింది. మొత్తంగా 478 మంది అభ్యర్థుల ప్రాధాన్య క్రమాన్ని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీకి అందించింది. ఈ మేరకు హెల్త్ వర్సిటీ తాజా ప్రకటన విడుదల చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్యాంకుల్లో 1511 పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెరిగింది. గతంలో ఇచ్చిన ప్రకటన మేరకు అక్టోబర్ 4వ తేదీతో తుది గడువు ముగియనుంది. తాజా ప్రకటనతో ఆన్‌లైన్ దరఖాస్తులకు అక్టోబర్ 14వ తేదీ వరకు అవకాశం ఇస్తున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.




### అభ్యంతరాల స్వీకరణ తర్వాతే

## ఫలితాలు వెల్లడి

### ఈ దశలో కోర్టు జోక్యం సరికాదు

### గ్రూప్ 1పై హైకోర్టులో టీజీపీఎస్సీ వాదనలు

### గ్రూప్ 1 నోటిఫికేషన్‌పై పిటీషన్లపై విచారణ

**హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** తెలంగాణ గ్రూప్ 1 నోటిఫికేషన్‌పై హైకోర్టులో పిటీషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. 2022లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీ చేయడం చెల్లదని పేర్కొంటూ జి దామోదర్‌రెడ్డితోపాటు వికారాబాద్, యాదాద్రి, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన మరో అయిదుగురు ఈ పిటీషన్లను దాఖలు చేశారు. అంతేకాకుండా తాజాగా నిర్వహించిన గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రాథమిక కీలో తప్పులున్నాయని, వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ పుల్లా కార్తీక్ గురువారం విచారణ చేపట్టారు. విచారణ సమయంలో ప్రభుత్వం తరపు న్యాయవాది కీలక విషయాలను ధర్మాసనానికి తెలియజేశారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షల కీపై అభ్యంతరాలు స్వీకరించామని, వాటిని ఆయా సబ్జెక్ట్‌ల వారీగా నిపుణుల కమిటీకి పంపి, వారు ఆమోదించిన తర్వాతే ఫలితాలు విడుదల చేసినట్లు టీజీపీఎస్సీ హైకోర్టుకు నివేదించింది. మెయిన్స్ క్వాలిఫై అయిన వారికి త్వరలో మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయని తెలిపింది. ఈ దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదని, దీనివల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం కలుగుతుందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి, టీజీపీఎస్సీ తరఫున ఎం రాంగోపాల్‌రావులు వాదనలు వినిపించారు. గ్రూప్ 1 పరీక్షలు రాసిన 3 లక్షల మంది నుంచి ప్రిలిమ్స్ కీపై భౌతికంగా 721, ఆన్‌లైన్ ద్వారా 6,470 అభ్యంతరాలు వచ్చినట్లు న్యాయవాదులు తెలిపారు. వాటిని నిపుణుల కమిటీ పరిశీలించి, కొన్ని సిఫార్సులు చేసింది. వీటిని పరిగణనలోకి తీసుకుని రెండు ప్రశ్నలను తొలగించి కీని విడుదల చేశామని వివరించారు. ప్రస్తుతం పిటిషన్ దాఖలు చేసిన ఐదుగురిలో ఒక్కరే కమిషన్‌కు అభ్యంతరాలు తెలియజేసినట్లు తెలిపారు. మిగిలినవారు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా కోర్టును ఆశ్రయించారన్నారు. రెండోసారి నోటిఫికేషన్ జారీని సవాల్ చేసిన అభ్యర్థితో పాటు కీని సవాల్ చేసిన పిటిషనర్లలో ముగ్గురు మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు వెల్లడించారు. ప్రశ్నలకు విశ్లేషణాత్మకంగా ఆలోచించి సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఒకరిద్దరికి అర్థం కానంత మాత్రాన అవి తప్పులైనట్లు కాదన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామని, ఈ పిటిషన్‌లను కొట్టివేయాలని న్యాయమూర్తిని కోరారు. అయితే గురువారం కోర్టులో వాదనలు పూర్తికాకపోవడంతో తదుపరి విచారణను అక్టోబరు 4కి వాయిదా వేశారు. శుక్రవారం ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత కోర్టు అంతిమ నిర్ణయం ఏం చెబుతుందనేది వేచి చూడాలి.

### ప్రజల రక్షణ మరియు ప్రజలకు

## సెన్సాఫ్ సెక్యూరిటీ భద్రతాభావం





**సిద్దిపేట అర్బన్ - ప్రభాత సూర్యుడు** సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కెసిఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిద్దిపేట ఏసీపీ మధు, మాట్లాడుతూ ప్రజల రక్షణ గురించి ప్రజలకు భద్రతాభావం సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ కల్పించడం గురించి మరియు ప్రజల యొక్క సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని, పట్టణాలలో కాలనీలో గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు కానీ వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని తెలిపినారు. అందులో భాగంగా ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రతి బ్లాక్ లో వారి యొక్క సమస్యలు తెలుసుకోవడం జరుగుతుంది. కాలనీలో ఏవైనా సమస్యలు ఉంటే 100 కాల్ చేయాలని సూచించారు. పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తారని ప్రజలు మహిళలు ఎలాంటి భయాలకు ఆందోళనకు గురికాకుండా నిర్భయంగా ఉండాలని సూచించారు. ఏ సమస్య ఉన్న దయల్ 100 కు కాల్ చేసి తెలపాలని సూచించారు. అవుట్ పోస్టులో 24 గంటలు పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. కాలనీలో ఎవరైనా అనుమానాస్పదంగా కనబడిన ఏవైనా సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల ధనమాన ప్రాణ రక్షణకు పోలీసులు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే లింకులు ఓపెన్ చేయొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ మరియు పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




## జీవో నెంబర్ 99పై స్టే విధించాలి

### హైడ్రాపై హైకోర్టుకు కేఏపాల్

**హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతలపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. జీవో నెంబర్ 99పై స్టే విధించాలంటూ ప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ జరుగగా.. హైడ్రా కూల్చివేతలు తక్షణమే ఆపేయాలని పాల్ వాదనలు వినిపించారు. అయితే ఇప్పటికిప్పుడు కూల్చివేతలు ఆపలేమని న్యాయస్థానం వెల్లడించింది. హైడ్రా కు చట్టబద్ధత కల్పించిన తరువాతే యాక్షన్ మొదలు పెట్టాలని పార్టీ ఇన్ పర్సన్‌గా కేఏ పాల్ వాదనలు వినిపించారు. అక్రమ కట్టడాలు కూల్చివేతలకు 30 రోజులు ముందే నోటీసులు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. వాదనలు విన్న హైకోర్టు.. ప్రతివాదులుగా హైడ్రా, ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ ధాఖలు చేయాలని హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈనెల 14కు వాయిదా వేసింది.

## అధికారిక నివాసాన్ని ఖాళీ చేసిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** ముఖ్యమంత్రి పదవికి గత నెలలో రాజీనామా చేసిన 'ఆప్' జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన అధికారిక నివాసమైన నార్త్ ఢిల్లీ సివిల్?లైన్స్ లోని 6, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్ రెసిడెన్స్‌ను శుక్రవారంనాడు ఖాళీ చేశారు. లుటియంస్ జోన్‌కు ఆయన మకాం మారుస్తున్నారు. ఆయన అధికారిక నివాసానికి ఉదయం రెండు మినీ ట్రక్కులు చేరుకోవడంతో షిఫ్టింగ్ ప్రక్రియ మొదలైంది. కేజ్రీవాల్, ఆయన భార్య సునిత కేజ్రీవాల్, కుమారుడు ఒక కారులోనూ, ఆయన తల్లిదండ్రులు, కుమార్తె మరో కారులోనూ బయలుదేరారు. మండి హౌస్ సమీపంలోని ఫరోజ్‌షా రోడ్డులో ఉన్న పంజాబ్ రాజ్యసభ ఎంపీ అశోక్ మిట్టల్ అధికారిక నివాసంలో కేజ్రీవాల్ కుటుంబ సభ్యులు ఉండనున్నారు. ఈ బంగ్లా రవిశంకర్ శుక్లా లేన్‌లోని ఆప్ ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఉంది.కేజ్రీవాల్ ముఖ్య మంత్రిగా పగ్గాలు చేపట్టిన 2015 నుంచి సివిల్‌లైన్స్‌లోని 6, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డు నివాసంలోనే ఉంటున్నారు. సీఎంగా రాజీనామా చేసిన తర్వాత అధికారిక నివాసాన్ని ఖాళీ చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో తన నివాసాన్ని కేజ్రీవాల్ ఎంచుకోవడంపై 'ఆప్' ఎంపీ మిట్టల్ ఒక వీడియో సందేశంలో సంతోషం వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ రాజీనామా చేసినప్పుడు ఆయనకు ఉండటానికి ఇల్లు లేదనే విషయం తెలిసి ఢిల్లీలోని తన నివాసానికి గెస్ట్‌గా రావాలని తాను కోరానని చెప్పారు. తన అభ్యర్థనకు కేజ్రీవాల్ ఆమోదం తెలపడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాగా, కేజ్రీవాల్ ఖాళీచేసిన అధికారిక బంగ్లాలోకి ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి వెళ్తారా లేదా అనే దానిపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రిగా అతిషి బాధ్యతలు చేపట్టినా, ఢిల్లీ సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ కూర్చున్న కుర్చీలో ఆమె కూర్చోవడం లేదు. ఆ పక్కనే మరో కుర్చీలో కూర్చిన ఆమె బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో అతిషి ఇల్లు మారతారా లేదా అనేది సందేహంగానే ఉందంటున్నారు.

## ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగులకు కొత్త పథకం!

### ఉద్యోగశిక్షణతోపాటు ప్రతినెల రూ.5000 ఆర్థికసాయం

### కీలక నిర్ణయం దిశగా కేంద్ర ప్రభుత్వం




**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు):** కేంద్ర ప్రభుత్వం దేశంలోని నిరుద్యోగులకు శుభవార్త తెలిపింది. దేశంలో ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగుల కోసం కొత్త పథకం ప్రారంభించింది. పిఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ పేరుతో ప్రతినెలా నిరుద్యోగులకు రూ.5000 ఆర్థిక సాయం అందించనుంది. కార్పొరేట్ అఫైర్స్ మంత్రిత్వశాఖ ఈ పథకం కింద నిరుద్యోగులకు కంపెనీలలో ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగులకు ఇంటర్న్‌షిప్ అందిస్తోంది. దేశంలో నిరుద్యో సమస్యకు పరిష్కరించే క్రమంలో కేంద్ర ప్రభుత్వం పిఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ తీసుకువచ్చింది. 2024 లో కేంద్ర బడ్జెట్ లో ఈ పథకం గురించి ప్రభుత్వం ప్రకటించింది. ఇండియాలోని టాప్ 500 కంపెనీలలో దేశంలోని 500 మంది నిరుద్యోగ యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ కోటి మంది నిరుద్యోగులకు పథకం కింద ఒకసారి రూ.6000, ఆ తరువాత ప్రతినెలా రూ.5000 ఇంటర్న్‌షిప్ ని ఆర్థిక సాయంగా అందజేస్తామని వెల్లడించారు. ఈ పథకం దశల వారీగా అమలు జరుగుతుంది. మొదటి దశ రెండు సంవత్సరాలు, రెండో దశ మూడు సంవత్సరాల వరకు ఉంటుంది. పిఎం ఇంటర్న్‌షిప్ పథకం ప్రక్రియ, అర్హత పిఎం ఇంటర్న్‌షిప్ పథకం ప్రకారం.. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు యువతకు ఇంటర్న్‌షిప్ లోని 10 శాతాన్ని చెల్లిస్తాయి. కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సియస్ఆర్)లో భాగంగా కంపెనీలో ఈ బాధ్యతను నిర్వర్తుస్తున్నాయి. ఈ పథకం ద్వారా ఇంటర్న్‌షిప్ పొందాలనుకునే నిరుద్యోగులు ఆన్‌లైన్ పోర్టల్ లో అప్లై చేసుకోవచ్చు. త్వరలోనే ఈ పోర్టల్ అందుబాటులోకి రానుంది. ఈ ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా ఉద్యోగం పొందాలనుకునే వారి వయసు 21 సంవత్సరాల నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి. చదువు పూర్తి చేసినవారికి మాత్రమే ఈ పథకం కోసం అప్లై చేసుకోవాలి. అయితే ఐఐఎం, ఐఐటి, ఐఐఎస్ఈఆర్ లాంటి ఉన్నత విద్యాసంస్థల్లో చదివిన వారికి ఈ పథకం వర్తించదు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసినవారు, ఐటిఐ, పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసినవారు ఈ పథకానికి అర్హులు. విద్యార్థులకు క్లాస్ రూమ్ చదువులతో పాటు కంపెనీలలో ప్రాక్టికల్ ఉద్యోగ అనుభవం ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా లభిస్తుంది. ఈ పథకం కోసం అక్టోబర్ రెండో వారంలో ప్రభుత్వం అన్ లైన్ పోర్టల్ ప్రారంభించబోతోంది. ఈ పథకంల ప్రభుత్వంతో ఒప్పందం ఉన్న కంపెనీలు ఈ ఆన్‌లైన్ పోర్టల్ లో ప్రత్యేకంగా డాష్ బోర్డ్ కేటాయిస్తాయి. అందులో ఇంటర్న్‌షిప్ అవకాశాలు, కంపెనీ లొకేషన్, ఉద్యోగం కావాల్సిన విద్యార్హత, ఇంటర్న్‌షిప్ కు లభించే సదుపాయాలు.. ఇలా అన్ని వివరాలుంటాయి. పోర్టల్ అభ్యర్థుల తమ వివరాలు నమోదు చేస్తే.. అదే రెజ్యూమ్ కూడా తయారు చేస్తుంది. ఇంటర్న్‌షిప్ కు అన్ని అర్హతలు కలిగిన అభ్యర్థులు తమకు సూట్ అయ్యే ఏదైనా అయిదు కంపెనీలలో అప్లై చేసుకోవచ్చు. ఈ పైలట్ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం దాదాపు రూ.800 కోట్లు ఖర్చు పెట్టబోతోంది. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 7 వరకు ప్రభుత్వం అన్ని అప్లికేషన్లు పరిశీలించి తరువాత నవంబర్ 15 లోగా అభ్యర్థులకు వారి సెలెక్షన్ గురించి తెలియజేయబడుతోంది. డిసెంబర్ 2, 2024 నుంచి ఇంటర్న్‌షిప్ మొదలవుతుంది. మార్చి 2025 లోగా మొత్తం 1.25 లక్షల అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ అందుతుంది.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Akshaya Printers, H.No:7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City, Telangana. Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215